అట్టహాసంగా వజ్రేష్‌యాదవ్ జన్మదిన వేడుకలు


ఘట్‌కేసర్: వజ్రేష్‌యాదవ్‌కు ఖడ్గాన్ని బహూకరిస్తున్న మామిళ్ల ముత్యాలు యాదవ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి


వజ్రేష్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొక్క ప్రభాకర్‌రెడ్డి


వజ్రేష్‌యాదవ్‌ను శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్పు రామారావు

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్/శామీర్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు, అభిమానుల మధ్య అట్టహాసంగా జరిగాయి. బోడుప్పల్‌లోని దేవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకలో పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలి వచ్చి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్‌కు కాంగ్రెస్ పార్టీ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మామిళ్ల ముత్యాలు యాదవ్, బొక్క ప్రభాకర్‌రెడ్డిలు ఖడ్గాన్ని బహూకరించారు. అదేవిధంగా దమ్మాయి గూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు రామారావు, నాగారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి వజ్రేష్ యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంతం అంజిరెడ్డి, ముల్లి పావని జంగయ్య, రాధాకృష్ణ, అబ్బసాని యాదగిరి, మల్లేష్, మేడబోయిన వెంకటేష్, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, ఫారుఖ్, వెంకటనారాయణ, నరేశ్ పాల్గొన్నారు. అదేవిధంగా అవుశాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కవాడి వామన్‌రెడ్డి, మాదవరెడ్డి, తదితరులు పాల్గొని వజ్రేష్‌యాదవ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో వజ్రేష్ యాదవ్ జన్మదిన సందర్భంగా మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి వజ్జల శశాంత్(బన్ని)లు కలిసి 150మంది పారిశుధ్య కార్మికులకు నూతన దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరయాంజాల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఆలయ ధర్మకర్త హరికృష్ణ, కత్తి రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: వజ్రేష్‌యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కవాడి వామన్‌రెడ్డి

రూ.60కోట్లతో రోడ్డు విస్తరణ


శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు

కొడంగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లాహోటీ కాలనీ పార్కు నుంచి బాపల్లి తండా చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. ఈ మేరకు ఆర్ అండ్‌బీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.16కోట్లతో రోడ్డు విస్తరణ పనులను త్వరలోనే చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రోడ్డు విస్తరణతో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగయ్యే అవకాశం ఉంది.

మూడుచింతలపల్లి తహసీల్దార్ బదిలీ


వెంకట నర్సింహారెడ్డి

శామీర్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మండల తహసీల్దార్‌గా పనిచేసిన వెంకట నర్సింహారెడ్డి మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సి సెక్షన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేసినట్లు సమాచారం. కాగా గతంలో వెంకట నర్సింహారెడ్డి శామీర్‌పేట మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి ప్రమోషన్‌పై వచ్చి మూడుచింతలపల్లి తహసీల్దార్‌గా పనిచేశారు. దాదాపు ఏడాదిన్నర పాటు ఆయన ఇక్కడ సేవలందించారు. ఆయన స్థానంలో కొత్తగా మహిళా తహసీల్దార్ రానున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వేరుశనగ పంటకు కోక కంచె

కొడంగల్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో వేరుశనగ సాగు చేసిన రైతులు పంటను అడవి జంతువుల నుంచి రక్షించుకునేందుకు తమ ఆలోచనలకు పదును పెడుతున్నారు. మండలంలోని భీమ్లీతండా శివారులో రైతు సాగుచేసిన వేరుశనగ పంట పొలం చుట్టూ చీరలను కంచెలా ఏర్పాటు చేశాడు. రాత్రి వేళల్లో గాలి వీచినప్పుడల్లా శబ్దాలు రావడంతో పంట పొలాల వైపు అడవి జంతువులు రావడం లేదని తెలిపాడు. కోక కంచె పంటకు శ్రీరామరక్షగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.


వేరుశనగ పంట పొలం చుట్టూ ఏర్పాటు చేసిన చీరలు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కులకచర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కులకచర్ల ఎస్సై రమేశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దోమ మండలంలోని మల్లెపల్లికి చెందిన దొడ్ల వెంకటయ్య(42) శనివారం రాత్రి కులకచర్లలో జరిగిన ఓ జన్మదిన వేడుకల్లో పాల్గొని రాత్రి 10గంటల సమయంలో టీవీఎస్ మోపెడ్‌పై మల్లెపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పాంబండ దారిలో మోపెడ్ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో వెంకటయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం ఉదయం గమనించిన కొందరు సమాచారం ఇవ్వగా వెళ్లి పరిశీలించగా వెంకటయ్యగా గుర్తించారు. అనంతరం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న ఎనిమిది మందిపై కేసు

ధారూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అంతారం గ్రామ శివారులో పేకాడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ పాషా, పోలీసు సిబ్బందితో కలిసి అట్టి స్థావరంపై దాడి చేశారు. అక్కడ ఎనిమిది పేకాడుతున్న ఎనిమిది మంది పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,340 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీటీరోడ్డు వేసేది ఎన్నడో?

- గుంతలమయంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గుంతలమయంగా కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు

కీసర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు అధ్వానంగా మారింది. మట్టిరోడ్డు కాస్త పెద్ద, పెద్ద గుంతలుగా మారడంతో అధికారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ఉన్న కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉమ్మడి కీసర మండలం ఉన్న సమయంలో పక్కా భవనంలో మార్చారు. ప్రభుత్వ భవనంలోకి మార్చి కూడా సంవత్సరాలు కావస్తోంది. అప్పటి నుంచి మార్కెట్‌లో ప్లాట్ల రేట్లు, ఫీజులు, డాక్యుమెంట్ ఫీజులు అన్నీ మారాయి. మారనిది కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు ఒక్కటే. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా రోడ్డు మాత్రం బాగుచేయడంలేదు. అడుగుకో గుంత అన్నట్లు, వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం వస్తే పరిస్థితి చెప్పలేనంత మారుతోంది. వర్షం పడితే ఆ దారి గూండా ప్రయాణించాలంటే చుక్కలు చూడాల్సిందే. ముఖ్యంగా రైతులు తెల్లవారుజామున, రాత్రి సమయంలో తమ వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాలంటే గుంతల మయంగా మారిన రోడ్డుతో నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వానికి లక్షల రూపాయాల ఆదాయం సమకూర్చే కార్యాలయానికి సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు వేయడం లేదంటే, ఇక మామూలు రోడ్ల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే దారిలో బీటీ రోడ్డు వేయాలని పలువురు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



గుంతల మయంగా మారిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో ప్రమాణీంచాలంటే నానా ఇబ్బందులు పడుతున్నాం. తెల్లవారుజామున, రాత్రి సమయంలో తమ వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తుంది. ఇక చినుకు పడితే మాత్రం పరిస్థితి చెప్పలేనంతగా మారుతుంది.

- రమేష్ యాదవ్, కీసర, రైతు

శాశ్వత పరిష్కారం చూపాలి



రోజూ వందల మంది రాకపోకలు సాగించే కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే దారికి శాశ్వత పరిష్కారం చూపాలి. మట్టి రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన పరిస్థితి మారడం లేదు. కావున కార్యాలయానికి వెళ్లె దారికి నిధులు కేటాయించి బీటీ రోడ్డు వేసి శాశ్వత పరిష్కారం చూపాలి.

- ప్రవీణ్ కుమార్‌గౌడ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు

తీరనున్న అవస్థలు

ప్రారంభమైన బీటీ పనులు

» వేగవంతంగా తాండూరు-హైదరాబాద్ రోడ్డు పనులు

పెద్దేముల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తాండూరు-హైదరాబాద్ రోడ్డులో కొద్ది రోజుల్లో వాహనదారుల అవస్థలు తీరనున్నాయి. బీటీ రోడ్డు పనుల ప్రారంభంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డులో పెద్దేముల్ మండలం కందనెల్లి నుంచి మన్‌సాన్‌పల్లి వరకు గోతులేర్పడ్డాయి. పదేళ్లుగా ఈ రోడ్డుతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ, క్యాబ్ డ్రైవర్లు ఈ రూటులో వెళ్లాలంటే భయపడిపోతున్నారు. డ్యూటీ చేసేందుకు జంకుతున్నారు. గత ప్రభుత్వంలో రోడ్డుకు నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ అరకొర పనులు చేసి వదిలేశాడు. దీంతో రోడ్డు పరిస్థితి మారలేదు. రోడ్డు బాగలేక హైదరాబాద్ వెళ్లేవారు ఎక్కువ మంది కొడంగల్, పరిగిల మీదుగా చుట్టూ తిరిగి పోతున్నారు. ఈ నేపథ్యంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రోడ్డు పనులు వేగవంతానికి చర్యలు తీసుకున్నారు. దీంతో పనులు పుంజుకున్నాయి. రెండుమూడు రోజుల నుంచి జోరుగా సాగుతున్నాయి. ఖాంజాపూర్ గుట్ట నుంచి రోడ్డు పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కందనెల్లి వరకు బీటీ పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకల్లా పనులు పూర్తయ్యేలా పని చేస్తున్నారు.


కందనెల్లి సమీపంలో బీటీ రోడ్డు పనులు

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం



వర్షాకాలం పూర్తయింది. వర్షాల వల్లే రోడ్డు పనులు నిలిచాయి. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో ప్రస్తుతం తాండూరు-హైదరాబాద్ బీటీ రోడ్డు పనులు ఊపందుకున్నాయి. ఇక నుంచి అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తాం. గతంలో ఎవ్వరూ చేయని ప్రజాపనులను ఈ పాలనలో చేసి చూపుతాం. పెండింగ్‌లోని అన్ని రోడ్డు పనులనూ చేపడతాం.

- మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు



యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

దుద్యాల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని యాదవ మహాసభ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌యాదవ్, మండల అధ్యక్షుడు నర్సిములుయాదవ్ అన్నారు. పోలెపల్లి గ్రామ యాదవ సంఘాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గోపాల్ యాదవ్, అధ్యక్షుడిగా వెంకటయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శిగా దీపక్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, చెన్నయ్య, వెంకటయ్య, మొగులయ్యయాదవ్‌లు ఎన్నికయ్యారు.



వికారాబాద్‌లో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

దీపావళి సందడి

- ప్రమిదలు, పూజా సామగ్రి, పటాకుల కొనుగోళ్లతో మార్కెట్లు బిజీ
- లక్ష్మీ పూజలకు సిద్ధమైన ప్రజలు, వ్యాపారులు

వికారాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో దీపావళి సందడి నెలకొంది. పండుగ సందర్భంగా పట్టణంలో ఆదివారం పూజ, అలంకరణ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు, దుకాణాల్లో రద్దీ నెలకొంది. లక్ష్మీ పూజలకు, వ్రతాలకు, మంగళహారతుల కోసం ప్రజలు, వ్యాపారులు పూలు, అరటి ఆకు బెరళ్లు, మామిడాకులు కొనుగోలు చేశారు. అలాగే ప్రజలు దీపంతలు, టపాసులు కొన్నారు. చిన్నాపెద్ద దుకాణాలకు రావడంతో రోడ్లలో రద్దీ కన్పించింది. సోమవారం వికారాబాద్ లోని దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, ఇళ్లలో లక్ష్మీపూజలు నిర్వహించుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

చీకట్లను పారదోలాలి

- ప్రజల జీవితాల్లో దివాళి వెలుగులు నింపాలి
- స్పీకర్ ప్రసాద్‌కుమార్



వికారాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వెలుగు దివ్వెలతో చీకట్లను పారదొలే పండుగ దీపావళి అన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో మరిన్ని వెలుగులు పంచాలని ఆయన అభిలషించారు. పేదలు, రైతుల జీవితాల్లో సంతోషాన్ని నింపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని అన్నారు. సుఖ సంతోషాలు, సిరి సంపదలు, సౌభాగ్యం, సమృద్ధి ప్రతి ఇంటా వెల్లివిరియాలని, తగు జాగ్రత్తలతో కుటుంబ సభ్యులందరూ దీపావళి పండుగను జరుపుకోవాలని స్పీకర్ ఆకాంక్షించారు.



పరిగిలో కవాతు నిర్వహిస్తున్న స్వయం సేవకులు

పరిగిలో స్వయం సేవకుల కవాతు

పరిగి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పరిగిలో పథసంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగి లక్ష్మీవేంకటేశ్వర ఆలయం నుంచి స్వయం సేవకులు రథాన్ని ఊరేగింపు నిర్వహించారు. స్వయం సేవకులు ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో పట్టణంలోని వీధుల గుండా కవాతు నిర్వహించి దేశ సమైఖ్యతను చాటారు.

శాంతి భద్రతల పరిరక్షకులు పోలీసులు

సమస్యలు చుట్టిముట్టినా.. విధులపైనే ధ్యాస

రేపు పోలీసు అమర వీరుల సంస్మరణ దినం



వికారాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసాంఘిక శక్తులు చెలరేగినా, సంఘ విద్రోహ శక్తులు పేట్రేగినా, శాంతి భద్రతలు అదుపు తప్పినా, ప్రకృతి వైపరీత్యాలతో జనజీవనం స్తంభించినా, ఉపద్రవాలు ముంచుకొచ్చినా, ప్రమాదాలు చోటుచేసుకున్నా అందరికీ వెంటనే గుర్తొచ్చే వారు పోలీసులు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసుల పాత్ర కీలకమైనది. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేం. పోలీసులు లేకుంటే అసాంఘిక శక్తుల అరాచకాలు.. విధ్వంసాలు ఊహించలేం. ప్రజల ప్రాణాలు పోవచ్చు.. ఆస్తులు లూటీ కావచ్చు. అరాచక శక్తుల ఆటకట్టించే వారు పోలీసులు.

నిత్యం ప్రజలతో మమేకమై...

పోలీసు వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పులతో సమాజంలో మేమూ భాగమేనంటూ పోలీసులు ప్రజలతో మమేకమై శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతున్నారు. సమస్యలెన్ని ఉన్నా వాటిని పక్కనబెట్టి పోలీసులు తమ విధులకు హాజరవుతారు. కుటుంబ సమస్యలను ఇంటి గడప వద్దే మరిచి శాంతి భద్రతల పరిరక్షణలో తమ పాత్ర పోషిస్తున్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఒక్క గంటైనా

మిగతా 10వ పేజీలో...















జాతీయ బీసీ అధ్యక్షుడిని కలిసిన రమేశ్‌గౌడ్



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న రమేశ్‌గౌడ్

శామీర్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌ను రాష్ట్ర బీసీ కార్మిక సంఘం అధ్యక్షుడు చింత రమేశ్‌గౌడ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రాష్ట్రంలో శనివారం తలపెట్టిన బీసీ బంద్ విజయవంతమైన సందర్భంగా ఆయనను కలిసినట్లు తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించి జీవో వచ్చే వరకూ తమ పోరాటం ఆగదని తెలిపారు.

శుభకార్యానికి హాజరైన ప్రముఖులు



శుభకార్యంలో యాలాల మండల నాయకులు

యాలాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వ్యాదరి బాలు కూతురు శారీ ఫంక్షన్ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి పేరి నారాయణరెడ్డి సతీమణి పేరి ప్రమీలమ్మ, జిల్లా కో-ఆప్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య. వార్ల సులేమాన్, గడ్డం రాములుగౌడ్, దూస చంద్రశేఖర్, వెంకటయ్యగౌడ్, పోస నరేష్, బూర్నపూర్తి నర్సింహులు, హన్మంతు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ధారాసింగ్ తదితరులు

పెద్దేముల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రేగొండి గ్రామంలోని మైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ శాకమోళ్ల శివకుమార్ గతేడాది ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ సందర్భంగా శివకుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పూజల్లో ఎ-బ్లాక్ అధ్యక్షులు లొంకన ర్సిములు, యువనాయకులు మహిపాల్‌రెడ్డి, సాయిని శ్రీనివాస్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.







జాతి నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

కులకచర్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జాతి నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని బీజేపీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం కులకచర్లలో పథ సంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్‌రావు మాట్లాడుతూ.. ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించడంతో పాటు దేశ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.





గురుకుల్ విద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలి


ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయంలో గల యజ్ఞశాల వద్ద ఆయా పార్టీల నాయకులు

ఘట్‌కేసర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గురుకుల్ విద్యాలయ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతీఒక్కరు కృషి చేయాలని ఆయా పార్టీల నాయకులన్నారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి గురుకుల్ అభివృద్ధిపై చర్చించారు. ఎంతో ఘన చరిత్ర గల కురుకుల్ విద్యా సంస్థ నిర్వాహణ అస్తవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల్ వ్యవస్థాపకుడు బన్సీలాల్ వ్యాస్ ఎంతో శ్రమించి నిర్మించిన విద్యాలయం పరిస్థితి రోజురోజుకు దిగజారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు వందల మంది విద్యార్థులతో కళకళలాడిన విద్యాలయం ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇక్కడ చేరడానికి ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గురుకుల్‌కు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, సింగిరెడ్డి రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవగౌడ్, సురేష్, రాఘవరెడ్డి, నర్సింగరావు, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నగేష్, బిక్షపతి పాల్గొన్నారు.









శబరిమలకు పాదయాత్ర


శబరిమల యాత్రకు బయల్దేరిన అయ్యప్పస్వాములు

వికారాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తులు భక్తి శ్రద్ధలతో శబరిమలై పాదయాత్రను ప్రారంభించారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఇరుముడి కట్టే కార్యక్రమం ఘనంగా జరిగింది. అయ్యప్ప మాలధారులు సంజయ్ గురుస్వామి, మహేందర్ గురుస్వామి, ధనంజయ్ చారి గురుస్వామి, శ్రీకాంత్ గురుస్వామి, సాయికుమార్ గదస్వామి, సంతోష్ గజాస్వామి, విక్రమ్ గంటస్వామి, సామల్ కత్తిస్వామి, సిద్దు కత్తిస్వామి ఇరుముడి కట్టుకుని శబరిమలకు బయల్దేరి వెళ్లారు.







చెంచుగడ్డకు భలే గిరాకీ!


చెంచుగడ్డను విక్రయిస్తున్న వృద్ధురాలు

ధారూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీజనల్ గడ్డగా పేరున్న చెంచుగడ్డకు భలే గిరాకీ ఉంది. ఏటా చలికాలంలో చెంచుగడ్డ విక్రయాలు కొనసాగుతాయి. భూమిలో పెరిగే ఈగడ్డ మంచి రుచితో పాటు బలవర్ధకమైన గడ్డగా చెబుతారు. తీగను గుర్తుపట్టి భూమిలో ఉన్న గడ్డను తవ్వి బయటకు తీసి ఉడకబెడుతారు. ఉడకబెట్టిన చెంచుగడ్డను చక్కెరతో తింటే భలే రుచిగా ఉంటుందని కొనుగోలుదారులు అంటున్నారు. ఈ చెంచుగడ్డను ప్రతీ రోజు ధారూరులో విక్రయిస్తున్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ సమీపంలోని చైతన్యనగర్ నుంచి చెంచు మహిళలు చెంచు గడ్డను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కిలో చెంచు గడ్డ రూ.200లకు విక్రయిస్తున్నట్లు వృద్ధురాలు తెలిపింది.




















ఇంజన్‌లో సాంకేతిక సమస్య

- తాండూరులో 2గంటలపాటు నిలిచిన వాడి ప్యాసింజర్



తాండూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రైలు ఇంజన్‌లో సాంకేతిక సమస్య తలెత్తి ఆదివారం తాండూరు రైల్వేస్టేషన్‌లో వాడి-కాచిగూడకు ప్యాసింజర్ రైలు 2గంటలపాటు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తాండూరు రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 4గంటలకు చేరుకున్న రైలు గ్రీన్ సిగ్నల్ వచ్చినా ఇంజన్ స్టార్ట్ కాలేదు. లోకో మాస్టర్ పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఇంజన్‌లో సమస్య తలెత్తి స్టార్ట్ కాలేదు. తాండూరు స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై నిలిచింది. దీపావళి పండగ నిమిత్తం హైదరాబాద్ వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైలులో కరెంట్ సరఫరా లేక బోగీల్లో చీకటైంది. మరో వైపు ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లు కూడా ఆలస్యమయ్యాయి. చివరికి మరో రైలు ఇంజన్‌ను తెప్పించి రైలును కదిలించారు.



రైలు నిలవడంతో ప్లాట్‌ఫామ్‌పై ప్రయాణికులు

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

కీసర రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించు కుందామని దమ్మాయిగూడ క్రాంతికీస్ అకాడమి కరెస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని 1,200 మంది స్థానికులకు సేఫ్టీ గాగుల్స్, చెవి రక్షణ కవచాలు, మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పల్ కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



సేఫ్టీ గాగుల్స్ పంపిణీ చేస్తున్న కరెస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

దరఖాస్తులు పెరిగేనా?

మద్యం దుకాణాల దరఖాస్తులకు గడువు పొడిగింపు

రెండేళ్ల పాటు మద్యం షాపుల లైసెన్స్‌కు ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించింది. శనివారంతో గడువు ముగియగా ఆశించిన మేర దరఖాస్తులు రాక గడువు పెంచారు. కాగా గతేడాది ఉన్న రూ.2లక్షల నాన్ రిఫండబుల్ ఫీజును ఈ సారి 3లక్షలకు పెంచడంతో దరఖాస్తుదారులు సిండికేట్ అవడం వల్లే దరఖాస్తులు తగ్గాయని అధికారులు భావిస్తున్నారు.

- ఔత్సాహికులకు మరిన్ని రోజుల అవకాశం
- మరో వెయ్యి దరఖాస్తులొస్తాయని అధికారుల అంచనా
- మద్యం షాపులకు పెరగనున్న పోటీ
- ఈ నెల 23వ తేదీ వరకు అప్లికేషన్ల స్వీకరణ.. 27న డ్రా



వికారాబాద్‌లోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారులు

వికారాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మద్యం దుకాణాలకు పోటీ పెరగనుంది. ప్రభుత్వం దరఖాస్తు రుసుం రూ.3లక్షలకు పెంచడంతో రెండేళ్ల కిందట వచ్చిన వాటి కంటే ఈసారి దరఖాస్తులు తగ్గాయి. జిల్లాలోని వైన్ షాపులకు శనివారం రాత్రి 10.30గంటల వరకు 1,750 దరఖాస్తులొచ్చాయి. అయితే దరఖాస్తుల దాఖలుకు ప్రభుత్వం గడువు పొడిగించింది. బీసీ బంద్ కారణంగా రవాణా, బ్యాంకు కార్యకలాపాల్లో అంతరాయం, తదితర కారణాలతో ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోలేకపోయారని గుర్తించిన ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

అధికారుల ఆశలు నెరవేరేనా?

జిల్లాలో 59 మద్యం దుకాణాలకు శనివారం వరకు 1,750 దరఖాస్తులొచ్చాయి. గతేడాది 59 మద్యం దుకాణాలకు 2,637 దరఖాస్తులు రాగా, ఈ సారి మొదట నిర్ణయించిన గడువు వరకు 1,750 దరఖాస్తులే వచ్చాయి. వికారాబాద్ సర్కిల్‌లో 15 మద్యం దుకాణాలకు 470దరఖాస్తులు, పరిగి సర్కిల్ 12 దుకాణాలకు 472, తాండూరు సర్కిల్ 18 షాపులకు 434, మోమిన్‌పేట్ సర్కిల్ 6 దుకాణాలకు 181, కొడంగల్ సర్కిల్ 8 దుకాణాలకు 193 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులకు ప్రభుత్వం ఈ నెల 23 వరకు గడువు పొడిగించడంతో కిందటి సారి వొచ్చినన్నైనా దరఖాస్తులు రావచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. గడువు పొడిగింపు ఎక్సైజ్ అధికారులకు ఊరట కలిగింది. దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని ధీమాగా ఉన్నారు.

ఎక్సైజ్ అధికారులకు తప్పని తిప్పలు ..

వ్యాపారులు సిండికేటవడంతో మద్యం వ్యాపారులు, ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ఎక్సైజ్ అధికారులు శ్రమించాల్సి వచ్చింది. కొందరిని ఫోన్ల ద్వారా సంప్రదిస్తే, మరికొందరు వ్యాపారులను వ్యక్తిగతంగా కలిసి నచ్చజెబుతున్నారు. కానిస్టేబుల్ నుంచి జిల్లా అధికారి వరకు ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. డ్రాలో ఎంపికైతే మీకు అన్ని విధాలా సహకరిస్తామని భరోసా కల్పిస్తున్నారంటే వారిపై ఉన్నతాధికారుల ఒత్తిడి ఏ మేర ఉందో స్పష్టమవుతోంది. దరఖాస్తుల గడువు ముగిసే వరకు మరో వెయ్యి దరఖాస్తులు రావొచ్చని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

కేటాయింపునకు 27న డ్రా

దరఖాస్తుల గడువు పెంపుతో మద్యం దుకాణాల డ్రాను 27వ తేదీకి మార్చారు. దుకాణాల డ్రాను మొదట ప్రకటించినట్లుగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కాకుండా జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ భవన్‌కు మార్చారు. ఉదయం 11గంటలకు డ్రా ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్ తెలిపారు.

వినయ్‌కుమార్‌ను సన్మానించిన దత్తాత్రేయ



వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

వికారాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2లో 314 ర్యాంకు సాధించి ఎంపీఈవో ఉద్యోగానికి ఎంపికైన వికారాబాద్ మండలం గొట్టిముక్కులకు చెందిన ఆర్.వినయ్‌కుమార్‌ను హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఘనంగా సన్మానించారు. ఇటీవల సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా వినయ్‌కుమార్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. వినయ్‌కుమార్ తల్లిదండ్రులు వికారాబాద్ మాజీ జడ్పీటీసీ అరుణ, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, గొట్టిముక్కల మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌లను అభినందించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్, సంఘం జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

(ఏడో పేజీ తరువాయి)

శాంతి భద్రతల పరిరక్షకులు పోలీసులు

ఊహించుకోలేం. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'పోలీస్'పై ప్రత్యేక కథనం.

ఒత్తిళ్లతో సతమతం



శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేసే 'పోలీసులు' ఒత్తిళ్లతో సతమతమవుతున్నారు. పోలీసు ఉద్యోగం ఒత్తిళ్లకు మారు పేరు. గతంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్ చదివిన వారే ఎక్కువగా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగంలోకి వచ్చేవారు. ఇప్పుడు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ప్రొఫెషనల్ కోర్సులు చదివిన వారు సైతం కానిస్టేబుల్ ఉద్యోగంలోకి వస్తున్నారు. పోలీసు ఉద్యోగంతో శాంతిభద్రతల పరిరక్షణలో తామూ భాగస్వాములమవుతున్నామనే భావన తమకు సంతృప్తినిస్తుందని వారంటున్నారు. జనాభాకు అనుగుణంగా పోలీసు సిబ్బంది లేకపోవడం ఆ శాఖకు ఇబ్బందికరంగా మారింది. ఉన్న వారిపైనే పనిభారం పడుతోంది. గతంతో పోల్చుకుంటే పోలీస్ శాఖలో సిబ్బంది సంఖ్య పెరిగినా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేదనేది తెలిసిందే. అయితే రోజురోజుకూ అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం పోలీసుల విధి నిర్వహణను కొంత సులభతరం చేస్తోంది. డ్యూటీ.. డ్యూటీ.. అంటూ వెళ్లే పోలీసులు.. తమ కుటుంబాలకు తగిన సమయం కేటాయించలేకపోతున్నారు. సాధారణ రోజుల్లో విశ్రాంతి దొరుకుతున్నా అత్యవసర పరిస్థితుల్లో సెలవులు లభించడం లేదు.

ఎన్నో విధులు ...

పోలీసుస్టేషన్‌లో సెంట్రీ డ్యూటీ, నిందితులను పట్టుకు రావడం, హాజరు పరిచేందుకు కోర్టులకు వెళ్లడం, నేర సంఘటనలకు సంబంధించి సమాచార సేకరణ, గస్తీ, బందోబస్తు విధులు, ఆందోళనలను అడ్డుకోవడం.. ఇలా పోలీసుల పరిధిలో లేని అంశమంటూ లేదు. పని ఒత్తిడి మధ్య పనిచేస్తూ పోలీసులు మానసిక స్థైర్యాన్ని కోల్పోతున్నారు. విధి నిర్వహణలోనో, నిద్రిస్తున్న సమయాల్లోనో కొందరు గుండెపోటుతో మరణిస్తున్నారు. పోలీసులు సరాసరి 40ఏళ్ల వయసులోనే అనారోగ్యం బారిన పడుతున్నారు. ఎస్పీ నారాయణరెడ్డి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యంపైనా శ్రద్ధ తీసుకుంటున్నారు. సిబ్బంది నైపుణ్యం పెంపొందేలా తరచూ శిక్షణ ఇప్పిస్తున్నారు.

అమరులను స్మరించుకుందాం

విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుని నివాళులర్పించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో అమర పోలీసులకు నివాళులర్పించేందుకు స్థూపం ఏర్పాటు చేశారు. ఆయా స్టేషన్లలో నివాళులర్పించిన తర్వాత పోలీస్ అధికారులు వికారాబాద్‌లో నిర్వహించే జిల్లా స్థాయి కార్యక్రమానికి హాజరవుతారు.